రాత్రి పదింటికి నరసింహం చప్పుడు చేయకుండా మురళి గదిలోకి ప్రవేశించాడు. రాధ ఒక్కతే నిద్రపోతోంది. మురళి ఆఫీస్‌రూమ్‌లో ఇంకా పని చేసుకుంటున్నాడు.

బీరువా దగ్గిరికి వెళ్లి చిన్న వూచతో దాని తలుపు తెరిచాడు. లోపల మరో అర వుంది. దాన్ని తెరవటం కూడా అతడికి కష్టం కాలేదు-- అది అతడి ఇల్లే కాబట్టి.

ఆ అరలోకి తొంగి చూశాడు. లోపల డైరీలున్నాయి. మురళివి!

అన్నిటికన్నా పైది తీసుకుని, నిశ్శబ్దంగా తన గదిలోకి వచ్చి చదవటం మొదలుపెట్టాడు. చివరి పేజీ దగ్గర అతడి దృష్టి ఆగిపోయింది.

"ఈ రోజు వాడు పూర్తిగా పరిస్థితి తాలూకు అడ్వాంటేజి తీసుకున్నాడు. రాధని కూడా అనుభవించాడు. నేనేం చెయ్యాలి?

అతి కష్టంమీద కంట్రోలు చేసుకున్నాను. నా పరిస్థితిలో ఇంకెవరన్నా వుంటే -- అక్కడికక్కడే భార్య ప్రాణాలు తీసి వుండేవాడు. లేదా విడాకులు ఇచ్చేవాడు. కానీ నేనెలా చెయ్యగలను?

నో .... ఐ లవ్ హర్ ... కానీ .... కానీ ..... మనసంతా ఏదో అసంతృప్తి.....

రాధ చాలా ఏడ్చింది. తండ్రిముందు బింకంగా వుంది కానీ లోపలికి వచ్చి ....

ఆమె నిజాయితీని మెచ్చుకోవాలి. కానీ నిజాయితీ బయటపెట్టిన నిజాల్ని మనసు వప్పుకోవటంలేదు.

ఆమెని బుజ్జగించటానికి చాలా కష్టపడవలసి వచ్చింది!

నేనింత 'మామూలు' గా ఈ విషయాన్ని తీసుకోవటం ఆమెకి అనుమానాన్ని కలిగించిందా -- రాధకి విడాకులు ఇచ్చిన మరుక్షణం నేనింత ఆస్థినీ వదులుకోవాలి. ఒకప్పుడు ఏ బీదతనంలో పెరిగానో మళ్ళీ అదే స్థితికి వెళ్ళిపోవాలి!

కేవలం ఆ కారణంగానే ఒక చెడిపోయిన ఆడదానితో కాపురం చేయటానికి సిద్ధపడ్డాను అన్న అనుమానం రాధకి వస్తే నేనేంచెయ్యాలి?

మైగాడ్! నేను రాధతో కలిసి వుంటున్నది డబ్బు కారణంగా కాదు -- ప్రేమ కారణంగా అని ఆమెకెలా తెలియ చెప్పాలి?

దీనికంతటికీ కారణం నా తల్లి.

నా సోదరుడు.

ప్రపంచంలో ఎవరూ చెయ్యని ద్రోహాన్ని -- రక్తం పంచుకుపుట్టిన వాడికి చేస్తున్నాడు హరికృష్ణ.

నేనేం చెయ్యను? ముఖ్యంగా రాధని ఎలా నమ్మించను? 'నీతో కాపురం చేయటం నా స్వార్థమే! కానీ అది డబ్బువల్ల కాదు. ప్రేమవల్ల ...' అని ఎలా వివరించను..... నా తల పగిలి పోతోంది ..."

నరసింహం డైరీ మూసేశాడు. మళ్ళీ నిశ్శబ్దంగా వచ్చి తీసిన చోటే డైరీలు పెట్టేశాడు.

తలుపు వేసి వెనుదిరుగుతూ వుంటే "ఎవరదీ" అని వినిపించింది.

ఉలిక్కిపడ్డాడు.

రాధ లైటు వేసి ఆశ్చర్యంగా "నాన్నా" అంది.

"ఏం లేదమ్మా! పడుకో " అని అక్కణ్ణుంచి కదిలాడు నరసింహం.

ఆ డైరీ ఆమెకూడా చదివిందని అతడికి తెలీదు.

***

నరసింహం గోడ గడియారం వంక చూశాడు.

పన్నెండు దాటింది టైము. గదిలో లైట్ డిమ్‌గా వెలుగుతోంది. టేబుల్‌మీదున్న బాటిల్లో నుంచి మరి కొంత ద్రవం గ్లాసులోకి వంచాడు. ఒక్క గుక్కలో గ్లాసుడు విస్కీ తాగేసి టేబుల్ మీదుంచాడు. తల పగిలిపోతుందేమో అన్నట్లుందతనికి. సాయంత్రం నుంచీ తాగుతూనే వున్నాడు. కణతలు చిట్లేలా ఆలోచిస్తూనే వున్నాడు.

ఈ హరికృష్ణ మిస్టరీ ఎంత ఆలోచించినా ఏమీ అంతుబట్టటం లేదు. మురళి కాలేజీలో చదువుతున్నప్పటి నుంచీ జరిగిన సంఘటనలన్నీ తను గమనిస్తూనే వున్నాడు. అన్ని సంఘటనల గురించీ ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూనే ఉన్నాడు. కానీ ఇప్పటివరకూ అంతా అయోమయంగానే ఉంది.

తను హత్యలు చేశాడు. అంతకంటే ఘాతుకమైన దారుణాలకు పాల్పడ్డాడు. కానీ ఎప్పుడూ ఏదీ తన మెదడునింత చిత్రవధ చేయలేదు.

తను పన్నిన పన్నాగాలన్నీటినీ ఆ హరికృష్ణగాడు అవలీలగా చిత్తుచేసేయ గలుగుతున్నాడంటే తనకు నమ్మశక్యం కావటంలేదు. ఎంత తెలివితేటలు గలవాడయినా, ఎంత ధైర్యవంతుడయినా-- కేవలం తనకూ మురళీకి మాత్రమే తెలిసిన రహస్యాలూ, ఏర్పరచుకున్న సంకేతాలు ఇవన్నీ -- ఎలా తెలుసుకోగలుగుతున్నాడు? ఇందులో ఏదో కిటుకు ఉండివుండాలి!

తన ఇంట్లోనే--వాడి ఏజంట్లు ఎవరో ఉండివుండాలి! ఎవరయిఉంటారు ఆ ఏజంట్లు? నౌఖరు వీరయ్య! ఉహు! కాదు ఎన్నో సంవత్సరాలనుంచీ తన ఉప్పు తింటున్న మనిషి! తన రహస్యాలు అనేకం కాపాడుతున్నాడు. అలాంటివాడు హరికృష్ణకు ఏజెంటుగా ఎందుకు పనిచేస్తాడు? అదీగాక వాడికసలు తమ మాటలు వినే అవకాశమే లేదు.

ఇకపోతే రాధ!

రాధ గురించి అప్పుడప్పుడు అనుమానాలు కలిగినా తన అనుమానాలు పూర్తిగా నిరాధారాలని తెల్సిపోయింది. అమె ఇల్లు వదిలి బయటకు వెళ్లదు. ఆమె కోసం బయటినుంచీ ఎవరూ ఇంట్లోకి రారు. ఎప్పుడో ఒకసారి ఆమె స్నేహితురాండ్రు రావటం తప్పితే -- రాధ ఎవరింటికీ వెళ్లదు. అదీగాక మురళీని కోరి ప్రేమించి చేసుకుందామె. చిన్నప్పటి నుంచీ మానసికంగా అతనికి భార్య అయింది. అలాంటి అమ్మాయి మురళికి వ్యతిరేకంగా కుట్ర

ఇకపోతే మురళి!

ఈ హరికృష్ణగాడి వ్యవహారాలకు అతడే సతమతమవుతున్నాడు. అదీగాక రాధను పెళ్ళి చేసుకున్నప్పుడు ఆ హరికృష్ణగాడు వాడెవడో ఓ దొంగ సన్యాసిని పంపించి ఆడిన నాటకం మురళి ఎలా మర్చిపోతాడు ? హరికృష్ణతో పాటు ఆ నాటకంలో పాలుపంచుకున్న శారదమ్మమీద కూడా ద్వేషం ఏర్పడింది వాడికి! ఇలాంటి పరిస్థితుల్లో వాళ్లతో చేయి ఎందుకు కలుపుతాడు?

నరసింహానికేమీ పాలుపోవటంలేదు. ఎంతసేపు ఆలోచించినా అనుమానాలన్నీ మళ్ళీ మురళి మీదకే మళ్ళుతున్నాయ్.

ఒకవేళ శారదమ్మ తనమీద కుట్రపన్ని ఇద్దరు కొడుకులకూ తన మీదకి పంపుతోందా?

ఉహూ, ఆ అవకాశమే లేదు.

అలాంటి పరిస్థితిలో అయితే మురళి వాళ్లతో చేయి కలిపే అవకాశంవుంది--కానీ!

మురళి హరికృష్ణకు సహాయం చేస్తాడు అనడానికంటే చేయడు అనడానికే ఎక్కువ కారణాలున్నాయ్. అతడి డైరీలే దానికి తార్కాణం.

ఏదేమయినా ఒకటి మాత్రం ఖాయం! తన ఇంటినుంచే తమ రహస్యాలు ఆ హరికృష్ణగాడికి చేరుతున్నాయ్. కనుక తను తన ఇంటి చుట్టూ ఉచ్చు బిగించి ఉంచాలి. రంగాతో పాటు వాడి అనుచరులు నలుగురిని కూడా రంగంలోకి దించాలి. అప్పుడు గానీ ఏమయినా ఫలితం ఉండదు.

తెల్లారిపోతుండగా మేడదిగి మెట్లపక్కనే వున్న గదిలోకి నడిచాడు నరసింహం.

రంగా గాఢనిద్ర పోతున్నాడు. టేబుల్ మీదున్న గ్లాసులో నీళ్ళు చేత్తో అతని మొఖం మీద చిలికాడతను.

రంగా భారంగా కళ్ళు విప్పాడు. నరసింహాన్ని ఎదురుగ్గా చూడగనే అతికష్టంమీద లేచి కూర్చున్నాడు.

"ఏమిటి సార్? ఏమయినా పని పడిందా!"

"వెంటనే వెళ్ళి మీ గాంగ్‌లో నలుగురిని తీసుకురా! బయట ఎక్కడోచోట వుండమని చెప్పు! మనింటి నుంచి బయటకు ఎవరు వెళ్ళినా, ఎవరు వచ్చినా వెంబడించమను."

రంగా ఆశ్చర్యంగా చూశాడు "అంటే -- ఆ హరికృష్ణగాడు మళ్ళీ వస్తాడంటారా?"

"తప్పకుండా వస్తాడు. లేదా వాడికి వివరాలు జేరవేసే వాడి ఏజెంట్ అయినా దొరుకుతాడు!"

"అలాగే సార్!" లేచి నిలబడుతూ అన్నాడతను.

నరసింహం అతనివేపు సంతృప్తిగా చూశాడు. రంగా దగ్గర తనకు నచ్చిన గుణం ఒకటుంది. పని చేయటం అతనికిష్టం! ఇరవై నాలుగ్గంటలూ పని చేయడానికయినా రడీయే! ఆ పని ఎంత ప్రమాదకరమయినదయినా సరే! పైగా ఆ పనివల్ల నాలుగు డబ్బులు

సంపాదించగలగాలి! అంతే!

మరి కొద్దిక్షణాల్లో రంగా తమ కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లటం కనిపించింది నరసింహానికి.

***

మురళి గారేజ్ నుంచి కారును బయటకు నడిపాడు.

ఘూర్ఖా సెల్యూట్ కొట్టాడు.

"ఇదిగో -- ఇప్పుడే చెప్తున్నా విను! నేను మళ్లీ నా కార్లో వస్తే తప్ప ... ఎవ్వరినీ లోపలకు రానీకు, తెలిసిందా?"

"తెలిసింది సాబ్--"

నరసింహం వడివడిగా మెట్లు దిగి మురళి దగ్గర కొచ్చాడు.

"జాగ్రత్త, వాడి జాడ తెలుసుకుంటే చాలు- మిగతాదంతా నేను చూసుకుంటాను--" అన్నాడు ఆందోళనతో.

మురళి నవ్వాడు. తన కోటు జేబులోనుంచి పిస్టల్ తీసి నరసింహానికి చూపించాడు.

"ఏం భయంలేదు మావయ్యా! ఏ పరిస్థితినయినా ఎదుర్కోగలను -- వాడెక్కడున్నా సరే-- వెతికి--పట్టుకునేది ఖాయం ఇవాళ!"

కారు ముందుకు దూసుకుపోయింది.

రోడ్డు అవతలివేపు వున్న మోటార్‌సైకిల్ ఒకటి తన కారుని వెంబడించటం అతనికి తెలుసు.

15

శారదమ్మ దిగాలుపడి కూర్చుని వుంది. ఉదయం పదిగంటలవుతోంది. ఇంకా కృష్ణ జాడ లేదు. మనసంతా ఏమిటోగా అయిపోతోంది. క్షణక్షణానికీ ఆదుర్దా పెరిగిపోతోంది. కృష్ణకేమైనా కీడు సంభవించలేదు కదా!

"భగవాన్! ఈ ఒక్కరోజు వాడిని క్షేమంగా ఇంటికి చేర్చు -- వెంటనే ఇద్దరం ఈ ఊరు వదిలేస్తాం. ప్రశాంతంగా జీవితం గడుపుతాం" చేతులు జోడించి ప్రార్థిస్తోందామె.

"అమ్మా!" తలుపు తట్టిన చప్పుడుతో పాటు కృష్ణ గొంతు వినిపించింది.

ఒక్క ఉదుటున లేచి వెళ్ళి తలుపు తీసింది.

కృష్ణ లోపలికొచ్చాడు. మళ్ళీ తలుపు మూసేసి తల్లివంక ఆప్యాయంగా చూశాడు "ఏమిటమ్మా అలా వున్నావ్? నిద్రపోలేదా రాత్రి?"

"ఒరే కృష్ణా! ఇంక మనం ఇక్కడ ఉండద్దురా! నాకేదో భయంగా వుంది! మనం రేపే ఈ ఊరునుంచి వెళ్లిపోదాం! ఏ మారుమూల పల్లెకో వెళ్ళి ప్రశాంతంగా బ్రతుకుదాం! నరసింహానికి తగిన శాస్తి దేవుడే చేస్తాడు--" కంపించే స్వరంతో అందామె.

కృష్ణ నవ్వాడు "వాడి ఆటలు నా దగ్గర సాగవమ్మా! భయపడకు--"

సరిగ్గా అప్పుడే తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. శారదమ్మ మొఖంలో భయం కనిపించింది. కృష్ణ వెనక్కు తిరిగాడు తలుపు తెరవడానికి.

కానీ శారదమ్మ చటుక్కున అతనికి అడ్డువచ్చింది "నువ్వు లోపలి గదిలోకెళ్ళు -- నేను చూస్తాను" అందామె.

"ఎందుకమ్మా అంత భయపడతావ్--"

"కృష్ణా -- నా మాట వినరా!" దీనంగా అందామె.

కృష్ణ మాట్లాడకుండా వంటింటి వేపు వెళ్లాడు.

శారదమ్మ తలుపులు తెరవగానే ఎదురుగ్గా రంగా నిలబడి ఉన్నాడు.

"ఎవరు మీరు?" అడిగింది శారదమ్మ.

"నేను హరికృష్ణ స్నేహితుడినమ్మా, అర్జంటుగా హరికృష్ణతో మాట్లాడాలి!"

"వాడింట్లో లేడు--"

రంగా లోపలివేపు అనుమానంగా చూశాడు.

శారదమ్మ తలుపులు మూసేయబోయిందిగానీ అతను చటుక్కున ఆమెను పక్కకుతోసి లోపలకు నడిచాడు.

శారదమ్మలో భయం ప్రవేశించింది "హరికృష్ణ లేడని చెప్తోంది నీక్కాదూ?" గట్టిగా అరిచిందామె.

అతను లోపలి గదిలోకీ, వంటింట్లోకి వెళ్లి తిరిగి వచ్చాడు.

"అర్జంటు పనుంది -- అందుకని వెతికాను--" అనేసి బయటకు నడిచాడు.

శారదమ్మ త్వరగా తలుపులు మూసి వంటింట్లోకి నడిచింది. అక్కడ కృష్ణ కనిపించలేదు. వెనుక తలుపులు తెరచి వున్నాయ్.